క్లుప్తంగా

బీజేపీ ఓటమి భారత ప్రజల విజయం

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): కర్ణాటకలో బీజేపీ ఓటమి.. భారత ప్రజల విజయం అని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలను అవసరాలను అర్థం చేసుకోకుండా వివక్ష, విద్వేషాలను పెంచి పోషిస్తున్న బీజేపీకి అర్థం అయ్యేవిధంగా కర్ణాటక ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మీదే తెలంగాణ ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: మండలంలోని కాశీంపూర్‌లో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్, మైనార్టీ కమిషన్ సభ్యుడు తన్వీర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎంజీ రాములు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిట్కుల్ గ్రామానికి చెందిన సంగన్నగారి కిష్టమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా గాయపడి వివిధ చోట ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ పరామర్శించారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కేఎస్పీపీ పట్టభద్రుల దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్పీపీ) తొలిపట్టభద్రుల దినోత్సవాన్ని ఆదివారం గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని శివాజీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3.00 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. పబ్లిక్ పాలసీ స్నాతకోత్తర (పీజీ) డిగ్రీని పూర్తి చేసిన 43 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలను ప్రదానం చేయనున్నారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్, కులపతి వీరందర్‌సింగ్ చౌహాన్, ఉపకులపతి దయానంద సిద్ధవట్టం, కేఎస్పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఆర్టీసీ పరిరక్షణ కమిటీ కృషి అభినందనీయం



రాజీవ్‌చౌక్ వద్ద పర్యవేక్షిస్తున్న పరిరక్షణ కమిటీ బాధ్యులు

నారాయణఖేడ్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు ఆర్టీసీ పరిరక్షణ కమిటీ చేస్తున్న కృషి అభినందనీయమని నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్ వద్ద శనివారం పరిరక్షణ కమిటీ బాధ్యులైన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, పీఆర్వో పాండు, కంట్రోలర్లు ఆంజనేయులు, శంకర్, మల్లయ్యస్వామి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ 15 రోజులుగా రోజూ రూ.11 లక్షలపైనే ఆదాయం వస్తోందన్నారు. వివాహాలు, విహారయాత్రలకు 10శాతం రాయితీతో బస్సులు అద్దెకు ఇస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్‌టీపీలో చేరికలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని కొల్కూర్ గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు శనివారం వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాయినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి సాయినాథ్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కబ్జా కోరల్లో ఎర్రకుంట?

- రూ.50కోట్ల విలువచేసే భూమికి ఎసరు
- కుంటను కబ్జా చేస్తూ భారీ నిర్మాణాలు?
- విచారణ జరుపుతున్న అధికారులు



కుంట ఉన్న స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు



గూగుల్ మ్యాప్‌లో కుంట ఉన్న స్థలం

జిన్నారం(పటాన్‌చెరు): కుంటల కబ్జాకు బొల్లారం మున్సిపల్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఏళ్ల కాలం నుంచి ఉన్న కుంటలు కబ్జాల పాలవుతున్నాయి. అక్రమార్కులు కుంట భూములను కబ్జా చేస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ తతంగం ఏళ్ల కాలం నుంచి కొనసాగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామికవాడను కలుపుకొని ఎర్ర(ఒర్ర)కుంట ఉంది. దీని విస్తీర్ణం 38గుంటలు. ఈ కుంటకు ఆనుకొని ఓ సంస్థకు చెందిన యాజమాన్యం భారీ నిర్మాణాలు చేపడుతోందని ఆరోపణలు ఉన్నాయి. గూగుల్ మ్యాప్‌లో సైతం ఎర్రకుంట ఉన్న ఆనవాళ్లు స్పష్టంగా కనబడుతున్నాయి. 2015లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. సర్వేనంబర్ 83లో 38 గుంటల భూమిని ఎర్రకుంటగా అధికారులు నిర్ధారించారు.

అధికారుల విచారణకు అధికార పార్టీ నేతల అండ?

ఎర్రకుంటను ఆనుకొని నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానిక బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపట్టగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సందర్శించి కుంట స్థలానికి సంబంధించి విచారణ జరుపుతున్నామని, పనులను నిలిపివేయాలని అధికారులు నిర్మాణ సంస్థకు ఆదేశాలు జారీ చేశారు. అయినా ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చేపడుతున్న విచారణకు కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ నిర్మాణ సంస్థకు అండగా ఉంటూ విచారణ జరపకుండా అడ్డుపడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

నిర్మాణాలను నిలిపివేయాలని స్థానికుల విజ్ఞప్తి..

నిర్మాణాలకు ఆనుకొని రసాయన పరిశ్రమలు ఉన్నాయి. రసాయన పరిశ్రమల సమీపంలో నివాస గృహాలను నిర్మించటం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే నిర్మాణాలను నిలిపివేసి కుంటను రక్షించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎర్రకుంటను గుర్తించాం

నిర్మాణాల సమీపంలో ఎర్రకుంట ఉన్నట్లుగా తమవద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. త్వరలోనే కుంట విషయంలో త్వరలోనే ఓ నిర్ణయాన్ని తీసుకుంటాం. ఉన్నతాధికారుల నుంచి నివేదిక రాగానే ఎర్రకుంటను రక్షించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– దిలీప్ ఇరిగేషన్‌శాఖ ఏఈఈ

ఆందోళనలు ఉధృతం చేస్తాం



ఎర్రకుంట కబ్జా అవుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు చూస్తూ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంటను కాపాడి, అక్రమ నిర్మాణాలు తొలగించాలి. లేనిపక్షంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళనలను ఉధృతం చేస్తాం.

– వరప్రసాద్‌రెడ్డి, కార్మికనేత, బొల్లారం

కోర్టులను ఆశ్రయిస్తాం



ఎర్రకుంటను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తాం. ఈ దిశగా తాము ఇప్పటికే చర్యలు ప్రారంభించాం. త్వరలోనే గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం.

– హన్మంత్‌రెడ్డి, కౌన్సిలర్, బొల్లారం

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ఆత్మీయ సమ్మేళనానికి అపూర్వ స్పందన



అభివాదం తెలుపుతున్న నాయకులు

కోహీర్(జహీరాబాద్): రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శనివారం కోహీర్ పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు. అనంతరం ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదిముబారక్, రైతుబంధు, రైతుబంధు, దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్, పింఛన్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కోహీర్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమకాంత్‌పాటిల్, ఆత్మకమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మైనార్టీ కమిషన్ సభ్యులు మహమ్మద్ తన్వీర్ ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ఆపదలో ఉన్న కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం నిజాంపేట్ మండలంలోని కల్వనికుంట తండాకు చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త మూడవత్ నాన్యనాయక్ మరణించడంతో అతని భార్య ముత్యాలుబాయికి రూ.2లక్షలు బీమా చెక్కును అందజేశారు. అనంతరం కల్హేర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పోశబోయిన లక్ష్మయ్య మరణించడంతో కుటుంబీకులను పరామర్శించారు. మహదేవ్‌పల్లికి చెందిన విఠవ్వకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.38 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ రాంసింగ్, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, రైతుబంధు అధ్యక్షులు దుర్గారెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ ఘని, నవాబ్, మాజీ ఎంపీపీ పద్మ బాపురాజు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

నారాయణఖేడ్: వివిధ పథకాల ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. కంగ్టి మండలంలోని తడ్కల్‌కు చెందిన రాములుకు రూ.14వేలు, ఎన్కెమురికి చెందిన జరప్పకు లక్ష, కల్హేర్ మండలంలోని మహదేవ్‌పల్లికి చెందిన విఠవ్వకు 38వేలు మంజూరయ్యాయి. అదేవిధంగా నిజాంపేట్ మండలంలోని కాల్వానికుంట తండాకు చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త ముడావత్ నన్యానాయక్ ఇటీవల మృతి చెందగా పార్టీ చేయించిన బీమా ద్వారా అతడి భార్య ముత్యాలబాయికి రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఆయా చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఖేడ్, కంగ్టి, కల్హేర్ జెడ్పీటీసీలు లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, లలితాఆంజనేయులు, నర్సింహారెడ్డి, ముఖ్య నాయకులు రమేష్‌చౌహాన్, రాంసింగ్, నవాబ్, ఘని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు



నారాయణఖేడ్: బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు



రామచంద్రాపురంలో..

నారాయణఖేడ్: కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించినందుకు హర్షిస్తూ నారాయణఖేడ్‌లో శనివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి నివాసం వద్ద మున్సిపల్ కాంగ్రెస్ ఉప ఫ్లోర్‌లీడర్ దారం శంకర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దమనకాండకు ఓటర్లు సరైన సమాధానం చెప్పారన్నారు. రాబోయే కాలంలో కర్ణాటక ఫలితాలు తెలంగాణలోనూ పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు సద్దాం, జ్ఞానేశ్వర్, అవుటి శంకర్ ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, అలీం, రాజు, హరీశ్, నరేష్, మల్లారెడ్డి, భూమయ్య, శ్రీను, శివ, వెంకన్న, మల్లేష్ పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో కల్హేర్‌లో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోచయ్య, నాయకులు ఎంఏ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో శనివారం రామచంద్రాపురం పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కుల, మతాల పేరుతో ప్రజలను విభజించి పాలించాలని చూస్తున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నవీన్‌గౌడ్, నాయకులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, తూర్పు శ్రీనివాస్, అరుణ్‌గౌడ్, బాబుగౌడ్, పీటర్, మహేష్, మిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

రాయికోడ్(అందోల్): కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో రాయికోడ్‌లోని స్థానిక పార్టీ కార్యాలయం నుంచి చిమ్నాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ నాగిశెట్టి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలో స్కోర్ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఝరాసంగం:(జహీరాబాద్): ఝరాసంగం ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్తకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: కర్నాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఎంపీపీ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా నాయకులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు .

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్‌కుమార్‌తో పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చింతా ప్రభాకర్

కంది(సంగారెడ్డి): రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.6 కోట్లతో ఇంద్రకరణ్ నుంచి ఓడీఎఫ్ వై జంక్షన్ వరకు, రూ.1.4 కోట్లతో జాతీయ రహదారి నుంచి ఇంద్రకరణ్ వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వేణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ చంద్రిశ్రీనివాస్ పాల్గొన్నారు.

పోరాడి హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న జయరాజ్

జోగిపేట(అందోల్): వీఓఏలు పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. శనివారం జోగిపేటలో వీఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ వీఓఏలు 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాయిలు, డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, వీఓఏల అధ్యక్షులు మల్లయ్య, కార్యదర్శి ఆంజనేయులు, వీఓఏలు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను బెదిరించడం సరికాదు



మాట్లాడుతున్న సాయిలు

జోగిపేట(అందోల్): సమ్మె విరమించాలని జేపీఎస్‌లకు ప్రభుత్వం నోటీసులు అందజేస్తూ బెదిరించడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు అన్నారు. శనివారం జోగిపేటలో సీఐటీయు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు కార్మికులు, ఉద్యోగులు భయపడరన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు యశోద, షేకమ్మ, రాములు పాల్గొన్నారు.

బైరి సోనికి కొవ్వొత్తులతో నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జహీరాబాద్ టౌన్: ఆత్మహత్య చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనికి జహీరాబాద్ డివిజన్ కార్యదర్శులు నివాళులు అర్పించారు. ఈ మేరకు శనివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బైరి సోని త్యాగం సాక్షిగా తమ హక్కులను సాధించుకుంటామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నినదించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిత్య, జిల్లా కార్యదర్శి నిషాపాటిల్, జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల అధ్యక్షులు బీరప్ప, నవీన్, మహేష్‌గౌడ్, రజనీకాంత్, నవీన్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

15 నుంచి మండల స్థాయి క్రీడలు

కోహీర్(జహీరాబాద్): ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండలంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో మండల స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాతనాయక్ తెలిపారు. వాలీబాల్ ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్‌తోపాటు అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు లేదా ప్రత్యేకంగా నియమించిన అధికారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ముదిరాజ్‌ల కులగణనను విజయవంతం చేయాలి

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని ముదిరాజ్‌ల పూర్తిస్థాయి వివరాల సేకరణకు సంబంధించి చేపట్టనున్న కులగణనను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు నారాయణ కోరారు. పట్టణంలోని స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం కులగణన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనుబడ్డారన్నారు. నియోజకవర్గంలో ముదిరాజ్ జనాభా ఎంత.. ఎంతమంది ఉద్యోగులు, విద్యార్హత కలిగినవారు ఉన్నారు.. కటుంబాల స్థితిగతులు, ఎంతమంది వ్యాపారులు, రాజకీయ నాయకులు ఎందరు... పూర్తి సమాచారం సేకరించడానికి నెల 21న గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి కులగణన చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీశైలం, బరూర్ దత్తాత్రి, విఠల్, అశోక్, మహేష్, రవి, అర్జున్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ చిలుకూరు బాలాజీ దేవస్థానానికి ప్రత్యేక బస్సులు

పటాన్‌చెరు టౌన్: భక్తుల సౌకర్యార్థం ప్రతి శని, ఆదివారల్లో పటాన్‌చెరు నుంచి చిలుకూరుకు బస్సులు నడుపుతున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ప్రతిగంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ బస్సులు పటాన్‌చెరు బస్‌స్టేషన్ నుంచి రామచంద్రాపురం, బీరంగూడ, అశోకనగర్, లింగంపల్లి, గచ్చిబౌలి అప్పా జంక్షన్లు మీదుగా చిలుకూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959226132 నెంబర్ సంప్రదించాలని తెలిపారు.

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వచ్చే నెల జూన్ 4వ తేదీన నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాల్లో చేర్చడంతో పాటు పార్లమెంట్ భవనానికి అనుభవ మంటపం నామకరణం చేయాలని కోరారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్‌లు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

◆ ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ నిర్మల పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

◆ 15 నుంచి క్రీడాపోటీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈనెల 15 నుంచి సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని హద్నూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ తదితర క్రీడలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో 15 నుంచి 36 ఏళ్ల లోపు యువతి, యువకులు పాల్గొనవచ్చని అన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడాపోటీల్లో పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ ఎండలతో నిర్మానుష్యంగా రహదారులు



ఝరాసంగం(జహీరాబాద్): గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. శనివారం ఝరాసంగంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. గత వారం రోజుల క్రితం వర్షాలు విస్తారంగా కురవడంతో ఎండలు తక్కువగా ఉన్నాయి. మూడు నాలుగు రోజుల నుంచి రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

◆ మంత్రికి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు స్వాగతం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరులో నిర్వహించే ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ ఆధ్వర్యంలో శనివారం రామచంద్రాపురంలో ఘనంగా స్వాగతం పలికారు.

◆ ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామానికి చెందిన బాల్‌రాజ్ కుమార్తె వివాహానికి రూ.15వేలు, ఇటీవల మృతి చెందిన సహదేవ్ కుటుంబానికి రూ.10వేలు, సుజాత కుటుంబానికి రూ.5వేల సాయాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును శనివారం స్థానిక నాయకులు నవీన్‌కుమార్, చిన్న కలిసి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

◆ ఘనంగా వైకుంఠపురంలో వేడుకలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో శనివారం స్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ ఉజ్జీవ సభల జాతర ప్రారంభం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్‌లో మూడు రోజుల పాటు కొనసాగే 91 మెథోడిస్టు క్రైస్తవ ఉజ్జీవ సభల జాతరను ఎమ్మెల్యే మాణిక్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 సంవత్సరాల నుంచి మెథోడిస్టు ఉజ్జీవ సభల జాతర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి రెవ జాన్‌వెస్లీ, లేలీడర్ సరీన్ జాన్, నిర్వాహకులు రవికుమార్, వినయ్‌కుమార్, మైనార్టీ కమిషన్ సభ్యులు తన్వీర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

జోగిపేట(అందోల్): సమ్మె విరమించాలని జేపీఎస్‌లకు ప్రభుత్వం నోటీసులు అందజేస్తూ బెదిరించడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు అన్నారు. శనివారం జోగిపేటలో సీఐటీయు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు కార్మికులు, ఉద్యోగులు భయపడరని, జూనియర్ కార్యదర్శులు సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు యశోద, షేకమ్మ, రాములు, కృష్ణ, మల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.

◆ ఎంపీపీ, జెడ్పీటీసీలకు వినతిప్రతం అందజేత

కల్హేర్(నారాయణఖేడ్): సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు శనివారం కల్హేర్‌లో ఎంపీపీ గుర్రపు సుశీలాఅంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు జబ్బార్, నాగరాజు, శ్రీనివాస్, శివరాం, అపర్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.